నెలబల్లిలో ఆక్రమణల పర్వం

నెలబల్లి రెవెన్యూ గ్రామం ప్రభుత్వ భూముల ఆక్రమణకు కేరాఫ్‌గా మారింది. ఈ ప్రాంతంలో జాతీయ రహదారి వెంబడే లక్షలు విలువ చేసే ఎకరాల కొద్దీ ప్రభుత్వ భూములు ఉండడంతో దీనిపై కన్నేసిన పలువురు కూటమి నాయకులు బడా నేతల సహకారంతో ఆక్రమించేస్తున్నారు. ప్రభుత్వ భూముల ఆక్రమణ వెలుగులోకి వస్తే మాత్రం రెవెన్యూ అధికారులు హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేస్తున్నారు. అయినా ఈ హెచ్చరిక బోర్డులను ఆక్రమణదారులు ఎవరూ లెక్క చేయడంలేదు. రహదారి వెంబడే ఉన్న ఈ భూములు ఎకరా రూ.50 లక్షలు పైబడి పలుకుతుంది.

- ప్రభుత్వ భూములు ఆక్రమించే పనిలో కూటమి నేతలు
- హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేస్తున్నా లెక్కచేయని వైనం
- లక్షలు విలుచేసే ప్రభుత్వ భూములు అన్యాక్రాంతం

దొరవారిసత్రం : మండలంలో ఎక్కడా లేని విధంగా నెలబల్లి రెవెన్యూ పరిధిలో ఎకరాల కొద్దీ ప్రభుత్వ భూములు ఆక్రమణకు గురవుతున్నాయి. ఈ ఆక్రమణలను రెవెన్యూ అధికారులు పూర్తి స్థాయిలో అడ్డుకునేందుకు ప్రయత్నిస్తున్నారు. ఈ రెవెన్యూ పరిధిలోని సర్వే నంబరు7లో 71 ఎకరాలు విస్తరించి ఉండగా బీసీ, ఎస్సీ కాలనీలో పాటు వివిధ ప్రభుత్వ భవనాలు, పాఠశాల నిర్మాణాలకు పోనూ 20 ఎకరాలపైగా రహదారి వెంబడే ఖాళీగా ఉంది. గతంలో కొందరు ఈ భూములను ఆక్రమించేందుకు యత్నించారు. అయితే దీన్ని గుర్తించిన అప్పటి రెవెన్యూ అధికారులు పీఓబీ (ప్రొహిబిటెడ్ ఆర్డర్ బుక్) కింద కేటాయించారు. అయినప్పటికీ సుమారు ఐదు ఎకరాల వరకు ఆక్రమణకు గురైంది. గత వారం ఖాళీగా ఉన్న ఈ భూమిపై కూటమి నేతల కన్నుపడడంతో సుమారు రెండు ఎకరాల వరకు ఆక్రమించి సాగుకు అనువుగా తీర్చేపనిలో పడ్డారు.

మాలగుంట చెరువుకు ఎసరు

నెలబల్లి గ్రామ సమీపంలో ఉన్న మాలగుంట చెరువు పొరంబోకు భూమినే ఆక్రమించేందుకు ఓ కూటమి నాయకుడు చదును చేస్తున్నాడు. ఈ చెరువు సమీపంలో పట్టా భూమి ఉంది. దీన్ని ఆసరాగా చేసుకుని కూటమి నాయకుడు పట్టా భూమిని మట్టితో చదువును చేస్తున్నట్లు పక్కనే ఉన్న మాల గుంట చెరువు పొరంబోకు భూమిని రెండు రోజుల నుంచి మట్టి తరలిస్తూ ఆక్రమిస్తున్నట్లు గ్రామస్తులు తెలియజేశారు.



నెలబల్లి సర్వే నంబరు 7లో ఆక్రమణకు గురైన ప్రభుత్వ భూమి

టైల్స్ కంపెనీ మాటున

నెలబల్లి రెవెన్యూ పరిధిలో సుమారు 80 ఎకరాల విస్తీర్ణంలో అతి పెద్ద టైల్స్ కంపెనీ గత ఏడాది నుంచి నిర్మిస్తున్నారు. ఈ కంపెనీ భూముల్లోనే ఓవైపు సర్వే నంబరు 323, 324 లో 7 ఎకరాల ప్రభుత్వ భూమి ఉంది. ఇక్కడ ప్రభుత్వ భూములు ఆక్రమణకు గురయ్యాయని స్థానిక గ్రామానికి చెందిన పలువురు రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేసినా సంబంధిత అధికారులు పట్టించుకోలేదు. ఈ ప్రభుత్వ భూముల్లో పలు నిర్మాణాలు చేపట్టి కంపెనీ నిర్వాహకులు ప్రభుత్వ ధరకు కొనుగోలు చేసేందుకు ప్రయత్నాలు సాగిస్తున్నారు. ఇందుకు మద్దతుగా స్థానిక రెవెన్యూ అధికారులు ముడుపులు తీసుకుని సహకరిస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. వీటితోపాటు సర్వే నంబర్లు 209-4,209-5, 127 కూడా ప్రభుత్వ భూములు ఆక్రమణలకు గురయ్యాయి.

ఎప్పటికప్పుడు అడ్డుకుంటున్నాం

నెలబల్లి రెవెన్యూ పరిధిలో ప్రభుత్వ భూముల ఆక్రమణలు తన దృష్టికి వచ్చిన వెంటనే ఎప్పటికప్పుడు అడ్డుకుంటున్నాము. ఆక్రమిత భూముల్లో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేస్తున్నాము. నెలబల్లి గ్రామ సమీపంలో ఉన్న చెరువు పొరంబోకు భూమి ఆక్రమణపై కూడా సర్వేయర్, సంబంధిత వీఆర్వోను పంపి సర్వే చేసి తగు చర్యలు చేపడతాం.

– శైలకుమారి, తహసీల్దార్, దొవ సత్రం





నెలబల్లి రెవెన్యూ పరిధిలో నిర్మాణంలో ఉన్న టైల్స్ కంపెనీ, నెలబల్లి గ్రామ సమీపంలో ఆక్రమణకు గురైన మాలగుంట చెరువు పొరంబోకు భూమి

క్లుప్తంగా

తాగునీటి బావిలో క్లోరినేషన్



బావిలో బ్లీచింగ్ చల్లిస్తున్న కార్యదర్శి గురవయ్య

సాక్షి ఎఫెక్ట్..

చిట్టమూరు: మండల పరిధిలోని ఎగువ దరఖాస్తు గ్రామంలో తాగునీటి బావిలో పంచాయతీ కార్యదర్శి గురవయ్య బుధవారం క్లోరినేషన్ చేయించారు. సాక్షి దిన పత్రికలో బుధవారం దరఖాస్తులో దాహం... దాహం అనే వార్త ప్రచురితమైంది. దీంతో స్పందించిన ఎంపీడీఓ మనోహర్ గౌడ్ పంచాయతీ కార్యదర్శితో గ్రామంలో తాగునీటికి ఇబ్బందులు లేకుండా చూడాలని కోరారు. కార్యదర్శి గ్రామంలో గ్రామస్తులు తాగునీటికి ఉపయోగించే బావిలో చెత్తా, చెదారం తీయించి బ్లీచింగ్ చల్లించి శుభ్రపరిచారు. గురవయ్య మాట్లాడుతూ ఆర్‌డబ్ల్యూఎస్ అధికారుల ద్వారా త్వరలో పైపు లైన్లకు మరమ్మతులు చేయించి గ్రామస్తులకు తాగునీటికి శాశ్వత పరిష్కారం చూపుతామన్నారు.

కూలి గిట్టుబాటయ్యేలా పని



మాట్లాడుతున్న ఎంపీడీవో వినీల్

బాలాయపల్లి (సైదాపురం) : మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా కూలీలకు కూలి గిట్టేలా పనులు కల్పించాల్సిన బాధ్యత ఫీల్డ్ అసిస్టెంట్లపై ఉందని ఎంపీడీఓ వినీల్ పేర్కొన్నారు. మండలంలోని తాళ్లపల్లిలో బుధవారం జరుగుతున్న ఉపాధి హామీ పథకం పనులను ఆకస్మికంగా తనిఖీచేశారు. ఆయన మాట్లాడుతూ ఫీల్డ్ అసిస్టెంట్ కొలతలు ఇచ్చి ఆ కొలతల ప్రకారం పనులు చేయిస్తే కూలి గిట్టుబాటు అవుతుందన్నారు. మాస్టర్లలో అక్రమ పేర్లు నమోదు చేస్తే వారిపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. కూలీలపై పెత్తనం చలాయిస్తే తగు చర్యలు తీసుకుంటామని చెప్పారు.

కాలుష్య నివారణకు మొక్కల పెంపకం



మొక్క నాటుతున్న అధికారులు

చిల్లకూరు: కాలుష్యాన్ని నివారించి భావి తరాలవారికి మంచి గాలిని అందించేలా ప్రతి ఒక్కరూ ఒక మొక్కను నాటి వాటి సంరక్షణ బాధ్యతను చేపట్టాలని తహసీల్దార్ శ్రీనివాసులు పిలుపునిచ్చారు. చిల్లకూరు వరగలి క్రాస్ రోడ్డులోని రెవెన్యూ కార్యాలయం ఆవరణలో బుధవారం మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టి సుమారు 50 రకాల మొక్కలను నాటారు. ఆయన మాట్లాడుతూ పచ్చదనం పెంపొందించడమే కాకుండా కాలుష్యాన్ని నివారించేందుకు కార్యాలయ ఆవరణలో మొక్కలు నాటుతున్నామని అన్నారు. కార్యాలయంలో పని చేసే ప్రతి ఒక్కరు మొక్కలను సంరక్షించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది, నాయకులు పాల్గొన్నారు.

యాంత్రీకరణ పథకాన్ని సద్వినియోగం చేసుకోండి



రైతులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

పెళ్లకూరు: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న యాంత్రీకరణ పథకాన్ని రైతులందరూ సద్వినియోగం చేసుకోవాలని నాయుడుపేట ఏడీఏ డాక్టర్ నాగార్జునసాగర్ తెలిపారు. తాళ్వాయిపాడు గ్రామంలో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రైతులందరూ పంట నమోదు చేపట్టాలని, తద్వారా కలిగే ప్రయోజనాలను వివరించారు. వ్యవసాయ యాంత్రీకరణ పథకం కింద రాయితీపై అందించే వ్యవసాయ పనిముట్లను సద్వినియోగం చేసుకోవాలన్నారు. పంటల బీమా పథకం నింద వరికి ఎకరానికి రూ.168 ప్రతి రైతు చెల్లించి బీమా చేసుకోవాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయశాఖ అధికారి డాక్టర్ విజభారతి, రైతులు పాల్గొన్నారు.

డి.వడ్డిపల్లి సర్పంచ్ మృతి



చెంచమ్మ (ఫైల్)

దక్కిలి: మండలంలోని డి.వడ్డిపల్లి పంచాయతీ సర్పంచ్ వేపమాను చెంచమ్మ (65) బుధవారం ఉదయం కన్నుమూశారు. ఆమె గత కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. ఆమెను చికిత్స నిమిత్తం చెన్నైకు తీసుకెళ్తుండగా మృతి చెందినట్లు బంధువులు తెలిపారు. ఈమె పదేళ్ల నుంచి సర్పంచ్‌గా కొనసాగుతున్నారు. 2013, 2021 సంవత్సరాల్లో వరుసగా సర్పంచ్‌గా గెలుపొందారు. ఆమె భౌతిక కాయాన్ని సందర్శించిన ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ, మాజీ జెడ్పీటీసీ ఏలేశ్వరం రామచంద్ర నాయుడు నివాళులర్పించారు.

అక్రమ కట్టడం కూల్చివేతకు సిద్ధం



అక్రమ కట్టడాలను పరిశీలిస్తున్న అధికారులు

కలువాయి(సైదాపురం) : అక్రమ కట్టడాన్ని కూల్చివేయాలని ఇరిగేషన్ ఏఈఈ హరికృష్ణ కలువాయి తహసీల్దార్‌కు బుధవారం నివేదికను అందజేశారు. మండలంలోని వెరుబొట్లపల్లి గ్రామంలో వాగు పోరంబోకు భూమిలో చెక్ డ్యామ్‌కు అడ్డంగా నిర్మిస్తున్న సుమారు 200 అంకణాల అక్రమ నిర్మాణాన్ని ఇరిగేషన్ మరియు రెవెన్యూ అధికారులు మరొకసారి అడ్డుకున్నారు. తొలుత గ్రామ రెవెన్యూ అధికారి జయరామయ్య ఆర్ఐ సునీల్‌వాగు పోరంబోకు భూమిలో అక్రమంగా నిర్మిస్తున్న కట్టడాన్ని నిలిపివేశారు. అయితే గ్రామ రెవెన్యూ అధికారి చేతివాటం ప్రదర్శించడంతో మళ్లీ వాగు పోరంబోకు భూమిలో నిర్మాణ పనులు మొదలెట్టారు. దీనిపై పత్రికల్లో వచ్చిన కథనాలకు కలెక్టర్ ఆనంద్ స్పందించి వెంటనే చర్యలు తీసుకోవాలని ఇరిగేషన్ అధికారులకు సూచించారు. అందులో భాగంగా బుధవారం కలువాయి ఇరిగేషన్ ఏఈఈ హరికృష్ణ, గ్రామ రెవెన్యూ అధికారి జయరామయ్య అక్రమ నిర్మాణ కట్టడాన్ని ఆపి నోటీసీలు అందించారు. అనంతరం ఇరిగేషన్ ఏఈఈ సురేష్ అక్రమ కట్టడాన్ని తొలగించి, ప్రభుత్వ భూములు పరిరక్షించాలని తహసీల్దార్‌కు నివేదిక అందజేశారు. అక్రమ నిర్మాణాన్ని కూలిచ్చేవేయాలంటూ వెరుబొట్లపల్లి పంచాయతీకార్యదర్శికి ఏఈఈ హరికృష్ణ ఆదేశాలు ఇచ్చారు.

కుట్రలతో జగన్ పర్యటనను అడ్డుకోలేరు



సమావేశంలో మాట్లాడుతున్న సంజీవయ్య, సుబ్రహ్మణ్యం రెడ్డి

నాయుడుపేటటౌన్: ఎవరెన్ని కుట్రలు, కుతంత్రాలు పన్ని దుర్మార్గంగా వ్యవహరించిన మాజీ సీఎం, వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి నెల్లూరు పర్యటన ఆపలేరని సూళ్లూరుపేట మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య, ఆ పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు తంబిరెడ్డి సుబ్రహ్మణ్యం రెడ్డి స్పష్టం చేశారు. పట్టణంలోని పార్టీ క్యాంపు కార్యాలయంలో బుధవారం సాయంత్రం వారు పార్టీ శ్రేణులతో సమావేశమయ్యారు. గురువారం ఉదయం నెల్లూరులో వైఎస్ జగన్ పర్యటించనున్న నేపథ్యంలో పలు సూచనలు చేశారు. జిల్లా జైలులో ఉన్న మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డిని, కోవూరు మాజీ ఎమ్మెల్యే నల్లపురెడ్డి ప్రసన్న కుమార్ రెడ్డి కుటుంబ సభ్యులను పరామర్శించేందుకు జగన్‌మోహన్ రెడ్డి గురువారం నెల్లూరుకు వస్తున్నట్లు తెలిపారు. ఈ పర్యటనకు ఎన్ని అవరోధాలు సృష్టించినా ప్రజాదరణ మెండుగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షులు ఒట్టూరు కిషోర్‌యాదవ్, నాయకులు కటకం జయరామయ్య, గంధవళ్లి సిద్దయ్య, షేక్ షబ్బీర్, పాలేటి నాగార్జున, కావేరిపాకం అశోక్ కుమార్, పేర్నాటి రాహుల్, నల్లారి ప్రకాశం, పాలేటి నాగార్జున, ఆకుతోట సుబ్బారెడ్డి, నిడిగింటి చిట్టిబాబు, తన్నమాల రమణయ్య పాల్గొన్నారు.

పౌర హక్కులను కాలరాస్తే చర్యలు తప్పవు



సివిల్ రైట్స్ డేలో అవగాహన కల్పిస్తున్న రెవెన్యూ అధికారులు

చిల్లకూరు: భారత రాజ్యాంగం కల్పించిన హక్కులను గురించి ప్రతి ఎస్సీ, ఎస్టీలు తెలుసుకోవాలని తహసీల్దార్ శ్రీనివాసులు సూచించారు. మండలంలోని వల్లిపేడు ఎస్టీ కాలనీలో బుధవారం సివిల్ రైట్స్ డే సందర్భంగా అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ దేశంలో పుట్టిన ప్రతి ఒక్కరికి భారత రాజ్యాంగం కొన్ని హక్కులను కల్పించిందన్నారు. వీటిని కాలరాసేలా ఎవరైనా ప్రవర్తిస్తే వారిపై చట్ట పరమైన చర్యలు తీసుకుంటామన్నారు. అలాగే గిరిజనులతో వెట్టి చాకిరీ చేయించినట్లు గుర్తిస్తే వారిపై కేసులు నమోదు చేసి జైలుకు పంపనున్నట్లు తెలిపారు. ఎస్సీ, ఎస్టీలను ఆలయ ప్రవేశం కాకుండా అడ్డుకోవడం, చదువుకునేందుకు ఆటంకం కల్పించడం లాంటివి చేయకూడదని అన్నారు. గ్రామ బహిష్కరణకు గురి చేసిన వారు అందుకు సహకారం అందించిన వారు శిక్షకు గురికావల్సి వస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ పూర్ణా, హషింగ్ ఏఈ బాషా, వీఆర్‌ఓ బాబి అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

పీఎంపీలకు అవగాహన అవసరం



వైద్యులను సత్కరిస్తున్న పీఎంపీ నాయకులు

గూడూరురూరల్ : అత్యవసర వైద్య సేవల పట్ల పీఎంపీలు అవగాహన కలిగి ఉండాలని మూత్ర పిండ వ్యాధి వైద్య నిపుణులు డాక్టర్ రాఘవేంద్ర అన్నారు. కమ్యూనిటీ పారామెడికల్స్ అండ్ ప్రైమరీ హెల్త్ కేర్ ప్రొవైడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ గూడూరు- నాయుడుపేట డివిజన్ ఉపాధ్యక్షులు చిరమన సాయి మురళి అధ్యక్షతన బుధవారం పట్టణంలోని కె.వి.హాస్పిటల్ సమావేశ మందిరంలో కిడ్నీ, గ్యాస్ట్రో ఎంట్రాలజీపై అవగాహన సదస్సు నిర్వహించారు. డాక్టర్ రాఘవేంద్ర మాట్లాడుతూ పీఎంపీలు మూత్ర పిండ వ్యాధులపై అవగాహన కలిగి ఉండి గ్రామీణ ప్రాంత ప్రజలకు తెలియజేయాలన్నారు. కిడ్నీ వ్యాధి బారిన పడకుండా చూడాల్సిన బాధ్యత పీఎంపీలపై ఉందన్నారు. అనంతరం డాక్టర్లు ద్వారకనాథ్ రెడ్డి, రాఘవేంద్ర, త్రివిక్రమ్, కీర్తిని ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో నారాయణ హాస్పిటల్ ఏఓ వెంకటేశ్వర్లు, పీఎంపీ డివిజన్ నాయకులు కరీముల్లా, శ్యాంసన్, చంద్రమోహన్, శంకరమ్మ, కవిత పాల్గొన్నారు.

వధూవరులకు నేదురుమల్లి ఆశీస్సులు



నూతన వధూవరులను ఆశీర్వదిస్తున్న నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి

సైదాపురం: మండలంలోని తూర్పుపూండ్ల గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకులు సరుపూరి శివయ్యనాయుడు కుమారుడు హరికృష్ణ వివాహ రిస్పెషన్ కార్యక్రమానికి బుధవారం వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి హాజరయ్యారు. నూతన వధూవరులు హరికృష్ణ, ప్రత్యూషను ఆయన ఆశీర్వదించారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ మన్నారపు రవికుమార్, మాజీ ఏఎంసీ చైర్మన్ బెల్లంకొంట మస్తాన్‌నాయుడు, వెంకటగిరి నియోజకవర్గ యువజన అధ్యక్షులు యోగిరాజు, మాజీ సొసైటీ అధ్యక్షులు మోహన్‌రావు, శివకుమార్, లింగసముద్రం సర్పంచ్ వరప్రసాద్‌రాజు, సైదాపురం ఉప సర్పంచ్ బిశివకుమార్, మండల నేతలు పాల్గొన్నారు.

మానవ అక్రమ రవాణా నిరోధక దినోత్సవం



సమావేశంలో మాట్లాడుతున్న జడ్జి సులోచన రాణి

చిల్లకూరు : మానవ అక్రమ రవాణాపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని గూడూరులోని జూనియర్ ప్రిన్సిపల్ సివిల్ జడ్జి బీవీ సులోచన రాణి సూచించారు. మండలంలోని రైటార్ సత్రంలో ఏర్పాటై ఉన్న అపెక్స్ పరిశ్రమలో బుధవారం ప్రపంచ మానవ అక్రమ రవాణా నిరోధక దినోత్సవాన్ని పురస్కరించుకుని మహిళా కార్మికులకు అవగాహన కలిగించారు. జడ్జి మాట్లాడుతూ ఇటీవల కాలంలో సాంకేతికత పెరిగిపోవడంతో యువతులను కొందరు మాయమాటల ద్వారా ఆకర్షితులను చేసుకుని వారిని వివిధ రకాలుగా తరలించేస్తున్నారని అన్నారు. చిన్న పిల్లలను ఇంటి వద్ద వదిలి ఇలా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు చూసుకునే సమయంలో పిల్లలకు సరైన రక్షణ కల్పించాలని సూచించారు. అనాథలు, బిక్షాటన చేసే వారిని కూడా కొంత మంది అక్రమంగా తరలించి వారి నుంచి అవయవాలను తస్కరించి సొమ్ము చేసుకుంటున్నారని తెలిపారు. అనంతరం గూడూరు డీఎస్పీ గీతాకుమారి మాట్లాడుతూ కార్మికులుగా పని చేసే వారు తమ కుటుంబాలకు కూడా అంతే ప్రాధాన్యత ఇవ్వాలని అన్నారు. ఈ కార్యక్రమంలో చిల్లకూరు ఎస్ఐ సురేష్‌బాబు, ప్యానల్ న్యాయవాది అరవ పార్వతయ్య, మహబూబ్‌బాషా, అపెక్స్ పరిశ్రమ ప్రతినిధులు పాల్గొన్నారు.

గ్రామ కంఠంలో ఇళ్ల నిర్మాణాలు గుర్తించండి

చిట్టమూరు: మండల పరిధిలోని గ్రామ కంఠం భూముల్లో ఇంటి నిర్మాణాలు చేపట్టి ఉంటే వాటిని గుర్తించాలని ఈఓపీఆర్డీ జనార్దన్ కోరారు. మండల పరిషత్ కార్యాలయ ఆవరణలోని స్త్రీశక్తి భవనంలో బుధవారం స్వామిత్ర స్టేజ్-2 శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. పంచాయతీ కార్యదర్శులు, డిజిటల్ సహాయకులు, సర్వేయర్లు ఇంజినీరింగ్ సహాయకులు, మహిళా సంరక్షణ కార్యదర్శులకు ఈ సర్వేపై దిశా నిర్దేశం చేశారు. మండలంలోని 16 గ్రామ పంచాయతీల్లోని 21 రెవెన్యూ గ్రామాల్లో గ్రామ కంఠం భూముల సర్వే నిమిత్తం ఎలా సర్వే చేయాలని శిక్షణ ఇచ్చారు. ఆగస్టు 1వ తేదీ నుంచి ఈ సర్వే ప్రారంభమవుతుందన్నారు. గ్రామ కంఠంలో ఇల్లు నిర్మించి ఉంటే వారికి ప్రాపర్టీ సర్టిఫికెట్ మంజూరు చేయనున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో మాస్టర్ ట్రయినర్ గోవర్ధన్, సర్వేయర్ మహిధర్ పాల్గొన్నారు.

విరమణ పొందిన మేనేజర్‌కు సన్మానం



ఖాజా మొహిద్దీన్‌ను సన్మానిస్తున్న కమిషనర్

నాయుడుపేటటౌన్ : మున్సిపల్ మేనేజర్‌గా పనిచేస్తూ ఉద్యోగ విరమణ పొందిన ఎంకే ఖాజా మొహిద్దీన్‌ను బుధవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో ఘనంగా సన్మానించారు. నాయుడుపేట మున్సిపల్ కార్యాలయంలో మేనేజర్‌గా పనిచేస్తూ అందరి మన్ననలు పొందారని కమిషనర్ షేక్ ఫజులుల్లా కొనియాడారు. వైఎస్సార్ సీపీ సంస్కృతి విభాగ రాష్ట్ర కార్యదర్శి కటకం జయరామయ్య, నాయకులు పేర్నాటి రాహుల్, అన్నమేటి చంద్రారెడ్డి ఖాజామొహిద్దీన్‌కు శాలువలు కప్పి ఘనంగా సత్కరించారు.

ముగిసిన పోలేరమ్మ పరమేశ్వరి ఉత్సవాలు



పొంగళ్లు పెట్టి ప్రత్యేక పూజలు చేస్తున్న భక్తులు

నాయుడుపేటటౌన్: పట్టణంలోని లోతువానిగుంట కాలనీలో వెలసివున్న పోలేరమ్మ పరమేశ్వరి ఉత్సవాలు బుధవారం నాడు ప్రత్యేక పూజలతో ఘనంగా ముగిశాయి. ఆలయం వద్ద అమ్మవారికి అభిషేకాలను నిర్వహించారు. మహిళా భక్తులు ఆలయం వద్ద అమ్మవారికి పొంగళ్లు సమర్పించి, మొక్కులు చెల్లించుకున్నారు. రాత్రి అమ్మవారికి మహా నైవేద్యం సమర్పించారు. ఈ కార్యక్రమాల్లో నిర్వాహకులు వినుకొండ ధనుంజయ, ఆనంద్, శివ, పీ గోపి, కే శ్రీనివాసులు, కే మునికష్ణ పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ నేతలకు పోలీసు ఆంక్షలు

కలువాయి(సైదాపురం) : మండలంలోని వైఎస్సార్‌సీపీ నాయకులకు, కార్యకర్తలకు కలువాయి పోలీసు ఆంక్షలు విధించారు. మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గురువారం నెల్లూరుకు వస్తున్న నేపథ్యంలో కార్యకర్తలు, నేతలు అక్కడికి వెళ్లకుండా బుధవారం పోలీసులు పత్రిక ప్రకటన విడుదల చేశారు. జిల్లాలో ఎక్కడా గుంపులు గుంపులుగా ఉండకూడదని, ర్యాలీలు చేయకూడదని, ఫ్లెక్సీలు ప్రదర్శించరాదని ఆంక్షలు విధించారు. అయినప్పటికీ అత్యంత విశేష ప్రజాదరణ కలిగిన జననేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై అభిమానాన్ని ఎవరూ ఆపలేరని వైఎస్సార్‌సీపీ కలువాయి మండల కన్వీనర్ కృష్ణారెడ్డి, జెడ్పీటీసీ అనిల్‌కుమార్‌రెడ్డి తెలిపారు.

చికెన్ ధరలు		31.7.2025
నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు		
బ్రాయిలర్ లైవ్	:	124
లేయర్ లైవ్	:	112
బ్రాయిలర్ చికెన్	:	224
బ్రాయిలర్ స్కిన్‌లెస్	:	248
లేయర్ చికెన్	:	190

నేడు మున్సిపల్ అత్యవసర సమావేశం

వెంకటగిరి రూరల్: పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ చైర్‌పర్సన్ నక్కా భానుప్రియ అధ్యక్షతన గురువారం ఉదయం కౌన్సిల్ సమావేశం నిర్వహించనున్నట్లు కమిషనర్ వెంకటరామిరెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఏడాది ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్న శ్రీపోలేరమ్మ తల్లి జాతర ఏర్పాట్లు, మున్సిపాలిటీలోని పలు వార్డుల్లో చేపట్టాల్సిన మౌళిక సదుపాయాల కల్పనపై 32 అంశాలతో కౌన్సిల్ సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ మేరకు మున్సిపల్ కౌన్సిలర్లు, ఎక్స్‌అఫిషియో సభ్యులు, అధికారులు విధిగా హాజరు కావాలని కోరారు.

కార్మిక సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలి



మాట్లాడుతున్న జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీరాములు

గూడూరురూరల్: భవన నిర్మాణ కార్మిక సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలని ఏపీ బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీరాములు డిమాండ్ చేశారు. గూడూరులోని సీపీఐ కార్యాలయంలో బుధవారం ఏఐటీయూసీ భవన నిర్మాణ కార్మిక సంఘం గూడూరు నియోజకవర్గ ముఖ్య సమావేశం జరిగింది. ఆయన మాట్లాడుతూ గత ఎన్నికల సమయంలో కూటమి ప్రభుత్వం తాము అధికారంలోకి వస్తే సంక్షేమ బోర్డు పునరుద్ధరణ చేస్తామని ఎన్నికల మేనిఫెస్టోలో పెట్టి కార్మికుల చేత ఓట్లు వేయించుకుని గద్దెనెక్కిందన్నారు. ఏడాది కాలం పూర్తయినా ఇప్పటి వరకు సంక్షేమ బోర్డు ఊసెత్తకపోవడం బాధాకరమన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ప్రభాకర్, నియోజకవర్గ కార్యదర్శి శశికుమార్, చిల్లకూరు మండల కార్యదర్శి రమేష్, సునీల్, భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు మీరా, బాల, మస్తాన్, భాస్కర్ పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

సైదాపురం: మద్యం తాగవద్దంటూ మందలించడంతో ఇంట్లో ఉన్న పురుగుల మందును మద్యంలో కలుపుకుని తాగి అపస్మారకస్థితికి చేరుకుని ఆస్పత్రిలో చికిత్స పొందుతూ యువకుడు మృతి చెందిన ఘటన మండల కేంద్రంలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల మేరకు.. సైదాపురం సమీపంలోని షామైన్ గిరిజన కాలనీకి చెందిన మేకల అశోక్(25)కు భార్య శ్రావణి వారి ఇద్దరు పిల్లలు ఉన్నారు. కూలీ పనులకు వెళ్లి జీవనం సాగించేవారు. నిత్యం మద్యం తాగుతుండడంతో భార్య, మామ ప్రశ్నించినందుకు ఆగ్రహించిన అశోక్ ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగుల మందును మద్యంలో కలుసుకుని సేవించాడు. దీంతో అపస్మారకస్థితిలో ఇంట్లో పడిపోవడంతో ఈనెల 26న చికిత్స నిమిత్తం నెల్లూరు ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. స్థానిక పోలీసులు ఆస్పత్రికి చేరుకుని శవ పంచనామా నిర్వహించారు. కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు ఎస్ఐ క్రాంతికుమార్ తెలిపారు.

కండలేరులో 26 టీఎంసీలు

రాపూరు: కండలేరు జలాశయంలో బుధవారం నాటికి 26.608 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు జలాశయం ఈఈ గజేంద్రరెడ్డి తెలిపారు. కండలేరు నుంచి సత్యసాయి గంగ కాలువకు 1,760, పిన్నేరు కాలువకు 20, లోలెవల్ కాలువకు 70, మొదటి బ్రాంచ్ కాలువకు 85 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు తెలిపారు.